ఒకరి భూమి మరొకరి పేరుపై రిజిస్ట్రేషన్!

- మంచాల తహసీల్ సిబ్బంది చేతివాటం
- న్యాయం చేయాలని ప్రజావాణిలో కలెక్టర్‌ను వేడుకున్న బాధిత మహిళా రైతు


ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శశాంకకు తన గోడు వినిపిస్తున్న మహిళా రైతు

ఆదిబట్ల, అక్టోబర్ 28 : తన పేరుపై ఉన్న భూమి తనకు తెలియకుండానే వేరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ కావడంతో బాధిత మహిళా రైతు సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం బండలేమూర్ గ్రామానికి చెందిన కొట్టం యాదమ్మ (భర్త సాయిలు)కు సర్వే నం.903లో 2ఎకరాల26గుంటలు, 906లో 6ఎకరాల14 గుంటలు మొత్తం 9 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నది. 1962 నుంచి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ప్రతి పహాణీ, రికార్డుల్లో యాదమ్మ పేరు వస్తున్నది. కానీ గత వారం రోజుల క్రితం వరకు ఆన్‌లైన్‌లో ఆమె పేరుతో ఉన్న భూమి సర్వే నం.903 నుంచి 2ఎకరాల8 గుంటలు, సర్వే నం.906లో ఒక ఎకరా21 గుంటలు మొత్తం కలిపి 3ఎకరాల29 గుంటల భూమి ఆమెకు తెలియకుండానే వేరొకరి పేరుపై పట్టామార్పిడి జరిగింది. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది చేతివాటంతో ఆన్‌లైన్‌లో ఉన్న రైతులకు తెలియకుండానే తొలగించి వేరొక్కరి పేర్లపై భూములు మారుస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంచాల తహసీల్దార్‌ను సంప్రదించినా పొంతన లేని మాటలు చెప్పి తప్పించుకుంటున్నారని వారు తెలిపారు. దీంతో యాదమ్మ తదితరులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కలెక్టర్ ఇబ్రహీంపట్నం ఆర్డీవోను ఆదేశించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వాటిని వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ శశాంక జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు అందించే వినతులకు సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారం కోసం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి 60 అర్జీలు రాగా.. రెవెన్యూశాఖకు సంబంధించి 42, ఇతర శాఖలకు 18 వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు ఉన్నారు.

నందివాగు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- నందివాగు, సర్వన్‌పల్లి ప్రాజెక్టుల్లో చేపపిల్లల విడుదల

వికారాబాద్, అక్టోబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై చేప పిల్లలను చెరువులు, ప్రాజెక్టులలో విడుదల చేస్తున్నదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. సోమవారం వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట నందివాగు ప్రాజెక్ట్, వికారాబాద్ మండలం గొట్టిముక్కల సమీపంలోని సర్వన్‌పల్లి ప్రాజెక్ట్‌లలో ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న చేప పిల్లలను స్పీకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న చేపల రకాలను పెంచితే అధిక లాభాలు వస్తాయని తెలిపారు. అవసరమైన చోట మత్స్యకార భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కోట్‌పల్లి చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం అడగగానే సీఎం రూ.110 కోట్లు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలోని మిగిలిన చెరువుల అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. చెరువులు, ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ద్వారా రైతుల పొలాలకు మంచిగా సాగునీరు అందుతుందని, చేపల పెంపకంతో మత్స్యకారులకు మంచి లాభాలు వస్తాయన్నారు. టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు.

రూ.1.14 కోట్లతో మార్కెట్ యార్డులో అదనపు గదులు

వికారాబాద్ కూరగాయల మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో రూ.1.14 కోట్లతో నూతనంగా నిర్మించే 24 దుకాణాల సముదాయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వికారాబాద్ మార్కెట్ కమిటీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇక్కడే ఖర్చు చేసుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి అనుమతులు ఇచ్చారన్నారు. మార్కెట్‌కు అవసరమైన అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. మార్కెట్‌లో ఇతర వసతులకు కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాం దుస్తులను స్పీకర్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మార్కెటింగ్, మత్స్య శాఖల అధికారులు, మత్స్య సంఘాల సభ్యులు, కూరగాయల వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ప్రజావాణికి 119 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబర్ 28 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణికి 119 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు, రైతు రుణమాఫీ, ఇతర సమస్యలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. స్వీకరించిన వాటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించామన్నారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, తగిన సూచనలిచ్చి పరిష్కరించేలా చూడాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

నేడు బూత్‌స్థాయి ఓటరు ముసాయిదా జాబితాలను ప్రదర్శించాలి

బూత్ స్థాయి ఓటరు ముసాయిదా జాబితాలను మంగళవారం ప్రదర్శించాలని లింగ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గంలోని 1133 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు ముసాయిదా జాబితాలను ప్రదర్శింపజేయాలన్నారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాలతో పాటు నారాయణపేటలోని 4 మండలాలు, మహబూబ్‌నగర్‌లోని గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో ప్రదర్శింపజేయాలని ఆయన సూచించారు. జాబితాలో పేర్లు నమోదుకానివారు నమోదు చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు.

మున్సిపాలిటీలో నస్కల్ విలీనం వద్దు

పరిగి : మండల పరిధిలోని నస్కల్ గ్రామాన్ని పరిగి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని ఆ గ్రామ నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు మెమోరాండం అందజేశారు. మున్సిపాలిటీలో కలపడం ద్వారా గ్రామస్తులపై మోయలేని పన్నుల భారం పడుతుందని, ఉపాధి హామీ పథకం పూర్తిగా రద్దవడంతో కూలీలకు పని లభించదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ మున్సిపాలిటీలో కలపరాదని వారు కోరారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ మండల మాజీ అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న వివిధ యువజన సంఘాల నాయకులు

లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు

- లెక్చరర్‌ను సస్పెండ్ చేయాలని పెద్దేముల్ జూనియర్ కళాశాల ఎదుట యువజన సంఘాల నాయకుల ధర్నా
- లెక్చరర్ సస్పెండ్ అయ్యేలా చూస్తాం
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్

పెద్దేముల్, అక్టోబర్ 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై వెంటనే సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని సోమవారం పలు యువజన సంఘాల నాయకులు, యువకులు పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా.. ఎలాంటి సంఘటనలు జరుగలేదని, ఫిర్యాదులు ఏమీ అందలేదని బదులిచ్చారు. ఉదయం 10.30కి ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్ కళాశాలకు చేరుకోగా.. ఆయనను యువజన సంఘాల నాయకులు ప్రశ్నించారు. తాను విద్యార్థినులతో మాట్లాడి విచారణ చేసి సదరు లెక్చరర్‌పై చర్యలు తీసుకుంటానన్నారు. విద్యార్థినులను విచారించిన అనంతరం లెక్చరర్‌ను వెంటనే సస్పెండ్ చేయడానికి ఇంటర్మీడియట్ బోర్డుకు లిఖితపూర్వకంగా సిఫారసు చేసి సస్పెండ్ అయ్యేలా చూస్తానని యువజన సంఘాల నాయకులకు బదులిచ్చారు. దీంతో సంఘం నాయకులు నోడల్ ఆఫీసర్‌పై దురుసుగా ప్రవర్తించడంతో అక్కడే ఉన్న ఎస్ఐ గిరి తన సిబ్బందితో కలిసి భద్రత కల్పించారు.

ఆలోపు అక్కడికి చేరుకున్న పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్‌ల అసోసియేషన్ మహిళా కార్యదర్శి రజిత అక్కడకు చేరుకొని మాట్లాడుతూ.. లెక్చరర్ అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం ముమ్మాటికి తప్పని, ఈ విషయమై ఇంటర్మీడియట్ ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. విద్యార్థినులకు అండగా నిలబడినందుకు వారికి ధన్యవాదాలు చెప్పారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరుగకుండా చూసుకుంటామన్నారు. స్పందించిన నోడల్ ఆఫీసర్ సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో యువజన సంఘాల నాయకులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంటనే లెక్చరర్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు లెక్చరర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకొని అతడిపై లైంగిక వేధింపుల కేసుతో పాటు, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు. దర్యాప్తు వేగవంతం చేసినట్లు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ నజర్

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- జిల్లాలో పీడీఎస్ బియ్యం పట్టివేత, పేకాటరాయుళ్ల అరెస్ట్


వికారాబాద్‌లో పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వికారాబాద్, అక్టోబర్ 28 : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు వికారాబాద్‌లోని మద్గుల్ చిట్టంపల్లి శివారులో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.21,570, 4 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వికారాబాద్ పీఎస్ పరిధిలోని సూర్యప్రకాశ్ కాలనీలో ఆటో ట్రాలీల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. 7.8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, 2 ఆటోలను సీజ్ చేసి వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని.. వారి నుంచి రూ.16,120, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని యాలాల పీఎస్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తాండూరుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతారం గ్రామంలో ఆరుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని వారి నుంచి రూ.10,090, 6 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. వారిపై తాండూరు పీఎస్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగినా.. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల గురించి టాస్క్‌ఫోర్స్ అధికారులను సంప్రదించడానికి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సెల్ నం. 8712670022ను సంప్రదించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

తాండూరులో టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా బాలల సంక్షేమ అధికారి విజయలక్ష్మి

ఆలూరులో అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంక్షేమ అధికారి విజయలక్ష్మి తదితరులు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 28 : బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా బాలల సంక్షేమ అధికారి విజయలక్ష్మి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధి ఆలూరు గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ భాగస్వామ్యంతో.. ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిరోధక చట్టం ఏర్పడి 18 సంవత్సరాలు అవుతున్నా నేటికీ బాల్యవివాహాలు జరగడం దురదృష్టకరమన్నారు. బాల్యవివాహాల నిర్మూలన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలతో జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నదన్నారు. జరగబోయే బాల్యవివాహాలను ముందస్తుగా గుర్తించి సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ లైన్ సర్వీస్‌కు సమాచారం అందించాలని, జిల్లాను బాల్య వివాహాల రహితంగా తీర్చిదిద్దాలన్నారు. 14 సంవత్సరాలలోపు పిల్లలు పనిలో ఉన్నట్లయితే అది మీ దృష్టికి వస్తే కార్మికశాఖకు లేదా హెల్ప్ లైన్‌కు సమాచారం అందించాలని, 18 ఏండ్ల లోపు పిల్లలు ప్రమాదకరమైన పనుల్లో ఉన్నట్లయితే 1098 కు ఫోన్ చేసి తెలుపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, సభ్యులు., ఆలూర్ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా అందని పింఛన్

దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని అధికారులను కోరుతున్న రామ్‌చరణ్

వికారాబాద్, అక్టోబర్ 28 : వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామానికి చెందిన రామ్‌చరణ్ దివ్యాంగుడు. అతినికి రేచికటి, మూగవాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్‌కు అర్హుడయ్యాడు. నెలకు రూ.3,116 అంది అతడి జీవితం సాఫీగా సాగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అతడికి సమస్యలు మొదలయ్యాయి. గత 6 నెలలుగా రామ్‌చరణ్‌కు పింఛన్ రావడంలేదు. 75 శాతం దివ్యాంగత్వం ఉన్నట్లు సర్టిఫికెట్లు ఉన్నా పింఛన్ కట్ చేశారని రోదిస్తున్నాడు. 6 నెలలుగా మండల కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం జరగడంలేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తనకు పింఛన్ అందించాలని కోరుతున్నాడు.


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అనిల్, కరీంపూర్ గ్రామస్తులు

కరీంపూర్‌లో బోగస్ ఓటర్ల నమోదుకు దరఖాస్తులు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనిల్

బంట్వారం(కోట్‌పల్లి), అక్టోబర్ 28 : వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలని గ్రామంలో ఉండని కొందరికి దరఖాస్తులు ఇస్తున్నారని, ఇందుకు సంబంధించి కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 40 మంది కరీంపూర్ గ్రామస్తులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కరీంపూర్ గ్రామంలో 650 ఓట్లు ఉండగా, అదనంగా మరో 80 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరంతా కరీంపూర్‌లో ఉండేవారు కాదని, హైదరాబాద్, దుబాయి, ముంబై తదితర ప్రాంతాల్లో ఉంటారన్నారు. వారికి శాశ్వత స్థానం అక్కడే ఉందన్నారు. తమ గ్రామంలో ఒక్క రోజు ఉండేవారు కాదన్నారు. 2023లో కూడా ఇలాగే బోగస్ దరఖాస్తులు చేస్తే, వెంటనే అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన ఆయన గ్రామాన్ని సందర్శించి విచారణ చేశారు. గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసి వాటిని తొలగించడం జరిగిందన్నారు. మరోమారు ఇలాంటి సంఘటన జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బోగస్ ఓట్లను జాబితాలో చేర్చేందుకు కొందరు కుటిల ప్రయత్నం చేస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

ప్రతిజ్ఞ చేయిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులు సన్మార్గంలో నడిచినపుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీసీపీ సుభిరామ్‌రెడ్డితో కలిసి ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు. విద్యార్థుల కదలికపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులతో డ్రగ్స్ వాడకుండా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, సీహెచ్ మల్లేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తాం

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలోని అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలోని రోడ్డును ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారి నర్సింహమూర్తితో కలిసి సందర్శించి రోడ్డు పునరుద్ధరణ పనులపై చర్చించారు. పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మున్సిపల్ చైర్మన్ నరేందర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నటరాజన్, మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్, అక్టోబర్ 28: కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పేదలకిస్తారా? లేదా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తారా? అనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పట్టుదలతో అప్పటి సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ సీడీఏంఏ టీకే శ్రీదేవి సహకారంతో షాద్‌నగర్ మున్సిపాలిటీకి 1710 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేయించుకొని నిర్మాణాలను పూర్తి చేశారని, గత ప్రభుత్వంలోనే అర్హులకు డబుల్ బెడ్రూంలను కేటాయించారని వివరించారు. కేటాయింపుల్లో ఎలాంటి రాజకీయ జోక్యం చేసుకోలేదని, సంబంధిత శాఖ అధికారులు సర్వే నిర్వహించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి కేటాయించినట్లు చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ పలువురు లబ్ధిదారులకు స్వయంగా ఇండ్ల కేటాయింపు పత్రాలను అందించారనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మర్చిపోయి తాజాగా రాజకీయ దందాకు తెరలేపారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ దరఖాస్తు పత్రాలను తయారు చేసి, ఇంటింటికీ తిరుగుతు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచిస్తూ గందరగోళాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. గత 10, 15 రోజుల నుంచి అన్ని కాలనీల్లో తిరుగుతూ లబ్ధిదారుల ఎంపికపై తప్పుడు ప్రచారం చేస్తున్నా ఎవ్వరు కూడా చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీలో వార్డు కౌన్సిలర్, వార్డు అధికారులను చేర్చాలని నిబంధన ఉన్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. కమిటీలను ప్రకటించే క్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకోరా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఇందిరమ్మ కమిటీలు నిష్పక్షపాతంగా పనిచేయాలని ప్రభుత్వం సూచించినా.. అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడంలేదని, అర్హత కలిగిన లబ్ధిదారులకు అన్యాయం జరిగేలా ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని, సోషల్ మీడియాల్లో ప్రచారం జరుగుతున్న కొత్త జాబితాపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల కేటాయింపు విషయంలో ముఖ్యంగా 8, 11, 12, 18, 19, 24, 27 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని వారు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 28 : కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, కుసుమలో ముల్లులేని రకాలను కనుగొనేలా పరిశోధనలు జరుగాలని జాతీయ నూనెగింజల పరిశోధనా మండలి డీడీజీ డా.శర్మ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వాటర్ టెక్నాలజీ సమావేశ మందిరంలో జాతీయ నూనెగింజల పరిశోధనలు, పీజేటీఎస్ఏయూ ప్రణాళిక రూపకల్పన రెండురోజుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర దేశాల నుంచి రూ.1.7 లక్షల కోట్లు వెచ్చించి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీనిని తగ్గించడానికే భారత జాతీయ నూనెగింజల మిషన్‌ని ఏర్పాటు చేశారన్నారు. కుసుమలో లైనోలేనిక్ ఆసిడ్ ఉన్నందున కరోనా నాటి నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. ఏడీజీ డా.సంజీవ్ మాట్లాడుతూ.. కుసుమ, అవిసెల సాగుకు అధిక రాష్ట్రాల వాతావరణం అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూనెగింజల సాగుకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. రైతు అవగాహన సదస్సులు, పరిశోధనలు పెరిగాయని మరింత పెరుగాల్సిన అవసరం ఉందని పేర